క్లుప్తంగా

వ్యాక్సిన్ల భద్రతపై శ్రద్ధ చూపాలి



సామర్లకోట అర్బన్ హెల్త్ సెంటర్‌లో గర్భిణులకు సూచనలిస్తున్న సుబ్బరాజు

సామర్లకోట: సామాజిక ఆరోగ్య కేంద్రాలకు, అర్బన్ హెల్త్ సెంటర్లకు వస్తున్న వ్యాక్సిన్ల భద్రతపై శ్రద్ధ చూపాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టరు కేవీ సుబ్బరాజు అన్నారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా స్థానిక గాంధీనగర్, ఏఎస్ కాలనీలో అర్బన్‌హెల్త్ సెంటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ ఓపీపై ఆరా తీశారు. హెల్త్ సెంటర్ పరిధిలోని గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల కోసం వచ్చిన గర్భిణుల ఆరోగ్య పరిస్థితి, హెల్త్ సెంటర్ సేవల తీరును తెలుసుకున్నారు. ఆయా సెంటర్లలో మంగళవారం 44 మంది గర్భిణులు హాజరు కావడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెల్త్ సెంటర్ల డాక్టర్లు కేవీపీ రమ్యప్రభ, పి.రమా శ్రీదుర్గ హెల్త్ సెంటర్ల పరిస్థితులను వివరించారు. డీపీహెచ్‌ఎన్‌ఓ టి.నీలవేణి, డీపీసీ కె.నరేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎండీ సత్తార్ బీబీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును కేబినెట్‌లో ప్రవేశపెట్టాలి

సామర్లకోట: రాష్ట్ర కేబినెట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు, మాదిగ ఆత్మగౌరవ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు వల్లూరి నాని మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం రాత్రి పెన్షన్ లైన్‌లో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు కేబినేట్‌లో ప్రవేశపెట్టి, ఆమోదం తెలపడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేలంగి సత్తిబాబు, మల్లెల మహేష్, సొదా మణి తదితరులు పాల్గొన్నారు.

23న పాఠశాల శతాబ్ది వేడుక

సామర్లకోట: పట్టణంలోని జిల్లా పరిషత్ నుంచి ప్రభుత్వ హైస్కూల్‌గా మారిన పాఠశాల శతాబ్ది వేడుక ఈ నెల 23న స్కూలు ఆవరణలో ఏర్పాటు చేసినట్టు పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు మంగళవారం ఇక్కడ తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 1924 నుంచి 2024 వరకు పాఠశాలలో చదువుకున్న విద్యార్థులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సంఘ అధ్యక్షుడు పసల పద్మరాఘవరావు కోరారు. పిఠాపురం రాజా జగపతి సూర్యారావు బహదూర్ ఆధ్వర్యంలో స్థాపించిన ఈ పాఠశాల వందేళ్లు పూర్తి కావడంతో శతాబ్ది వేడుకల్లో పాల్గొనడం పూర్వ విద్యార్థులకు వరమన్నారు. ఇప్పటి వరకు సుమారు 500 మందిని గుర్తించి, ఆహ్వానించినట్టు తెలిపారు. 23న ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని, ఈ సందర్భంగా గురువులను సత్కరిస్తామని వివరించారు. పాఠశాల అవసరాల మేరకు సహకరించడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. సంఘ కార్యదర్శి కొప్పిరెడ్డి సత్యనారాయణమూర్తి, అల్లకి వెంకటకృష్ణశాస్త్రి, రెడ్నం లక్ష్మీపతిరావు పాల్గొన్నారు.

కోర్టు ఫీజు స్టాంపులు విడుదల చేయాలి

కాకినాడ లీగల్: ఏడాది కాలంగా కాకినాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కోర్టు ఫీజు స్టాంపుల కొరత ఉందని, వీటిని వెంటనే విడుదల చేయాలని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టులో కేసులకు సంబంధించి దాఖలు చేసే ప్రతి పిటీషన్‌పై కోర్టు ఫీజు స్టాంపులు అంటించాల్సి ఉందన్నారు. కాకినాడలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కోర్టు ఫీజు స్టాంపులు లేకపోవడం వల్ల న్యాయవాదులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కోర్టు ఫీజు స్టాంపులను ఇతర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ప్రైవేటు వ్యక్తులు తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారని చెప్పారు. కోర్టు ఫీజు స్టాంపులు వెంటనే విడుదల చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా అధికారుల దృష్టికి అనేక సార్లు తీసుకువెళ్లినా సమస్యను పరిష్కరించలేదని తెలిపారు. కోర్టు ఫీజు స్టాంపులు వెంటనే విడుదల చేయాలంటూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రికి, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీకి, డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్లకు లేఖలు రాసినట్టు తెలిపారు.

బెల్టు షాపులపై ఎక్సైజ్ దాడి

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో బెల్టు షాపులపై ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఓ మహిళ నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు నార్త్ స్టేషన్ ఎక్సైజ్ సీఐ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ డీజిల్‌తో మోసం

- సముద్రంలో ఆగిపోతున్న బోట్ల ఇంజిన్లు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



అమీనాబాద్ పెట్రోలు బంకులో కల్తీ డీజిల్ విక్రయించారంటూ ఆందోళన చేస్తున్న మత్స్యకారులు (ఫైల్)

కొత్తపల్లి: వేటకు వెళ్లే మత్స్యకార బోట్ల యజమానులకు ఆయిల్ భారం కాకూడదనే ఉద్దేశంతో గత ప్రభుత్వం డీజిల్ సబ్సిడీని ఏర్పాటు చేసింది. లీటరు రూ.6 ఉన్న సబ్సిడీని రూ.9.15కి పెంచింది. దీని ద్వారా సంవత్సరంలో 10 నెలల పాటు ఒక్కో కార్డుకు 300 లీటర్ల డీజిల్‌ను సబ్సిడీ ద్వారా పొందవచ్చు. మండలంలో శ్రీరాంపురంలో ఉన్న మహాలక్ష్మీ ఏజెన్సీస్, అమీనాబాద్‌లో ఉన్న లక్ష్మీలోకేష్, రాఘవేంద్ర బంకుల ద్వారా డీజిల్ పొందుతున్నారు. అయితే మత్స్యకారులకు సబ్సిడీ ద్వారా అందించే డీజిల్‌ను బంకు యజమానులు కల్తీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మత్స్యకారుల ఆందోళన

ఉప్పాడ– కోనపాపపేట బీచ్ రోడ్డులోని అమీనాబాద్‌లో ఉన్న పెట్రోలు బంకుల్లో కల్తీ డీజిల్‌ను విక్రయించారంటూ ఇటీవల మత్స్యకారులు ఆందోళన నిర్వహించారు. కల్తీ డీజిల్ కారణంగా సముద్రంలో రెండు బోట్లు నిలిచిపోయాయి. దీంతో తోటి మత్స్యకారుల బోట్ల సహాయంతో వారు తీరానికి సురక్షితంగా చేరారు. కల్తీ డీజిల్‌ను విక్రయించి తమ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మత్స్యకారులు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు.

పలుమార్లు ఇదే పరిస్థితి

పెట్రోలు బంకుల్లో సబ్సిడీ ద్వారా అందించే డీజిల్‌ను కల్తీ చేస్తున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు డీజిల్, పెట్రోలు కల్తీ జరిగి నీరు కలిసి రావడంతో పలువురు మత్స్యకారులతో సహా వాహన వినియోగదారులు సైతం ఆందోళన వ్యక్తం చేశారు.



అమీనాబాద్ పెట్రోలు బంకులో తనిఖీలు చేస్తున్న అధికారులు (ఫైల్)



కల్తీ డీజిల్‌ను విక్రయించి మత్స్యకారులను మోసం చేస్తున్న పెట్రోలు బంకు

డీజిల్ సబ్సిడీ కార్డులు ఇలా..

1100 బోట్లకు డీజిల్ సబ్సిడీ కార్డులు ఉన్నాయి. ఒక్కో లీటరుకు రూ.9.15 సబ్సిడీతో ఒక్కో కార్డుకు 300 లీటర్లు సంవత్సరానికి 10 నెలల పాటు ఈ సబ్సిడీని అందిస్తున్నారు.

బంకుపై చర్యలేవి?

అమీనాబాద్‌లో ఉన్న హెచ్‌పీ పెట్రోలు బంకులో మత్స్యకారులకు కల్తీ డీజిల్ విక్రయించినా బంకు యజమానిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. చేస్తున్నా తూతూమంత్రంగానే తనిఖీలు జరుగుతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. ఈ బంకులో సుమారుగా 400 కార్డుదారులు డీజిల్‌ను కొనుగోలు చేస్తున్నారు.

ప్రాణాలతో చెలగాటం



పెట్రోలు బంకుల యజమానులు మత్స్యకారులకు కల్తీ డీజిల్‌ను విక్రయించి వారి ప్రాణాలతో ఆటలాడుతున్నారు. దాడులు చేయడం తూతూమంత్రంగా అధికారులు వచ్చి తనిఖీలు చేయడం పరిపాటిగా మారింది. ఏనాడు కూడా వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలే లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్తీ డీజిల్‌ను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

– ఉమ్మిడి జాన్, మత్స్యకార నాయకుడు, ఉప్పాడ

చర్యలు తప్పవు

బంకుల యజమానులు కల్తీ డీజిల్‌ను విక్రయిస్తే ప్రభుత్వ పరంగా వారిపై చర్యలు తీసుకుంటాం. ఇటీవల అమీనాబాద్ హెచ్‌పీ పెట్రోలు బంకులో కల్తీ డీజిల్‌ను విక్రయిస్తున్నారని మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. దీనిపై తనిఖీలు నిర్వహించి డీజిల్ నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాం. వాటి ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

– ప్రసన్న లక్ష్మి, డీఎస్ఓ, పౌర సరఫరాల శాఖ

ప్రతి ఒక్కరూ తాత్విక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా
- ముగిసిన వార్షిక జ్ఞాన మహాసభలు



సభకు హాజరైన పీఠం సభ్యులు



సభలో ప్రసంగిస్తున్న ఉమర్ ఆలీషా

పిఠాపురం: సామాన్యుని మొదలుకొని తత్వవేత్తల వరకూ కాలం అందరినీ పరీక్ష పెడుతుందని కాలానికి ఎవరూ అతీతులుకారని కాల పరీక్షలను తట్టుకోవాలంటే తాత్విక జ్ఞానం పెంపొందించు కోవాలని పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పీఠం 97వ వార్షిక జ్ఞాన మహాసభలు ముగింపు సందర్భంగా మంగళవారం పిఠాపురం పీఠం ప్రధాన ఆశ్రమంలో నిర్వహించిన సభలో ఆలీషా సభ్యులకు అనుగ్రహ భాషణ చేశారు. పంచ భూతాత్మక శక్తి స్వరూపుడే మానవుడని తెలిపారు. మానవ జీవితంలో అత్యంత విలువైంది కాలమని, తాత్వికులు యోగులు అందరూ కాలగమనంతో ప్రయాణం చేసిన వారేనన్నారు. ఆధ్యాత్మిక తాత్విక జ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా కాలం పెట్టే పరీక్షలను తట్టుకునే శక్తి లభిస్తుందన్నారు. నిరంతర కృషి ద్వారానే సత్ఫలితాలను పొందగలమని, మానసిక తృప్తి మానవుడిని సంస్కార వంతుడిని చేస్తుందన్నారు. ప్రతి చిన్న విషయానికి అసహనానికి గురవుతూ అనేక సమస్యలను కొని తెచ్చుకుంటున్న మానవుడు జీవిత కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే సహనశక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. ధ్యాన, జ్ఞాన, మంత్ర సాధనలతో కూడిన త్రయీ సాధనను అలవరచుకోవడం ద్వారా సహనశక్తి లభిస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పీఠం చేపట్టిన 'నా మొక్క, నా శ్వాస' కార్యక్రమంలో ప్రతి సభ్యుడూ పాల్గొని తమ వంతుగా ఒక్కో మొక్కను నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, పీఠాధిపతి సోదరుడు అహ్మద్ ఆలీషా, ఆదిత్య విద్యా సంస్థల అధినేత శేషారెడ్డి, రెడ్ క్రాస్ ఏపీ స్టేట్ చైర్మన్ వై.డి.రామారావు, జనసేన నేత మర్రెడ్డి శ్రీనివాస్, గోదావరి డెల్టా చైర్మన్ ఎం.సునీల్, బీజేపీ నేత ఎస్వీ సత్యనారాయణ, బ్యాంక్ ఆఫ్ మహా రాష్ట్ర మేనేజర్ రాజ్ నందినీ పాండా, గీతా వధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, పి.మంజుల తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ వారు ఏర్పాటు చేసిన కుట్టుమెషీన్లు, వీల్ చైర్స్ పక్షుల ఆహారం కోసం తయారు చేసిన ధాన్యపు కుచ్చులను, ఎన్ఆర్ఐ సభ్యులు పేరూరి విజయరామ సుబ్బారావు, సన దంపతులు భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రం కోసం ఏర్పాటు చేసిన ఎలక్ట్రో స్టిమ్యులేటర్లను పీఠాధిపతి, ముఖ్య అతిథుల కలిసి అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పీఠం సభ్యులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రజలకు తాగునీటి కటకట



సామర్లకోటలో నీళ్ల ట్యాంకర్ వద్ద జనం



ఉండూరు రోడ్డులో ప్రధాన పైపులైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న ఏఈ

ప్రధాన పైపులైన్‌లో సమస్యే కారణం

సామర్లకోట: పట్టణ పరిధిలో మంగళవారం తాగు నీటి సమస్య ఏర్పడింది. స్థానిక ఉండూరు రోడ్డులో ఉన్న ఫిల్టర్‌బెడ్ ప్లాంట్ నుంచి ట్యాంకులకు అనుసంధానంగా ఉన్న ప్రధాన పైపులైన్ ధ్వంసం కావడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ముందస్తు సమాచారం లేకుండా తాగునీటి కుళాయిల నుంచి నీటి సరఫరాను నిలిపివేయడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ప్రధాన పైపులైన్ మరమ్మతులు రెండో రోజైన మంగళవారం కొనసాగాయి. పైపులైన్ మరమ్మతులను మున్సిపల్ డీఈ శశిధర్, ఏఈ రమేష్ పర్యవేక్షించారు. ప్రధాన పైపులైన్ పూర్తిగా పాడైపోవడంతో బుధవారం సాయంత్రానికల్లా మరమ్మతులు చేసి, నీటి సరఫరా పునరుద్ధరిస్తామని ఏఈ రమేష్ తెలిపారు. నీటి సరఫరాలో సమస్య తలెత్తడంతో మున్సిపల్ అధికారులు కొన్ని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని పంపిణీ చేశారు. ట్యాంకర్ల వద్ద మహిళలు నీటి కోసం పరుగులు తీయాల్సి వచ్చింది. తాగునీటి కోసం జనం ఆర్వో ప్లాంట్లను ఆశ్రయించారు. దాంతో ఆర్వో ప్లాంట్ల వద్ద క్యూలో నిలబడి నీటిని కొనుగోలు చేయడం కనిపించింది.

నేటితో భజన పోటీల ముగింపు

సామర్లకోట: వేట్లపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి భజన పోటీలు మంగళవారం ఆసక్తికరంగా సాగాయి. వేంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో ఆదివారం నుంచి జిల్లా స్థాయి భజన పోటీలను స్త్రీ, పురుషుల విభాగాల్లో నిర్వహిస్తున్నారు. ఈ భజన పోటీలు బుధవారంతో ముగుస్తాయి. విజేతలైన స్త్రీ, పురుషులకు వేర్వేరుగా బహుమతులు అందజేస్తారు. స్వామివారి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం గోదావరి కాలువ రేవులో స్వామివారి చక్రస్నానం అనంతరం ఆలయం వద్ద పూర్ణాహుతి ఉంటుంది. రాత్రి స్వామివారి పుష్పయాగంతో కల్యాణ ఉత్సవాలు ముగుస్తాయి. ఈ సందర్భంగా భజన పోటీల్లో విజేతలకు ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తారు. పోటీలకు గండేపల్లి మండలానికి చెందిన వేముల బాపిరాజు, కె.గంగవరం మండలానికి చెందిన మేడిశెట్టి సత్యనారాయణ, ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం వడిశలేరు, కట్టమూరు, అగ్రేవుల, వేట్లపాలెం గ్రామాలకు చెందిన భజన బృందాలు పోటీల్లో పాల్గొన్నాయి.



పోటీల్లో పాల్గొన్న వేట్లపాలెం భజన బృందం

సేవ చేసే వారికి సహకరించాలి

ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

సామర్లకోట: సేవలు చేసే వారికి ఓటు వేసి సహకరించాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న డి.వీర్రాఘవులుకు మద్దతుగా ఆయన పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని ఉపాధ్యాయులను కలిశారు. అభ్యర్థి వీర్రాఘవులు విజయానికి సహకరించాలంటూ ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తిలో 40 ఏళ్లు సేవలందించి, అనేక ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేసిన అనుభవజ్ఞుడైన వీర్రాఘవులుకు ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓట్లు వేయాలన్నారు. నిజాయితీగా ప్రజల గళాన్ని శాసన మండలిలో వినిపిస్తారన్నారు. ఆయన వెంట సీపీఎం నాయకులు నవర సురేష్‌కుమార్, కరణం ఏడుకొండలు, దారబాని కృష్ణ, చల్లా మహేష్, పసుపులేని వీరబాబు తదితరులు ఉన్నారు.



సామర్లకోటలో ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థిస్తున్న వెంకటేశ్వరరావు, వీర్రాఘవులు

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై దాడులు

ఏడుగురి అరెస్టు, 20,128 కేజీల రేషన్ బియ్యం, 3 వాహనాల స్వాధీనం

పిఠాపురం: నియోజకవర్గ పరిధిలో గత రెండు రోజులుగా రేషన్ బియ్యం అక్రమ రవాణాలపై దాడులు చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి 20,128 కిలోల రేషన్ బియ్యాన్ని, 3 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. పట్టుకున్న బియ్యం విలువ రూ.9,25,888 ఉంటుందని ఆయన తెలిపారు. పట్టుకున్న వాహనాల్లో రెండు బొలెరో వెహికల్స్, ఒక లారీ ఉన్నట్టు ఆయన తెలిపారు. పిఠాపురం సర్కిల్ గొల్లప్రోలు పోలీస్ స్టేషన్, పిఠాపురం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో గొల్లప్రోలు, దుర్గాడ, బి.ప్రత్తిపాడు, ఎఫ్‌కే పాలెం గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచి, రవాణాకు సిద్ధం చేసిన రేషన్ అక్రమ రేసన బియ్యాన్ని నిల్వదారులపై రవాణా చేస్తున్న వారిపై గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ, పిఠాపురం రూరల్ ఎస్సై గుణశేఖర్ ఇతర పోలీసు సిబ్బంది, పిఠాపురం సర్కిల్ క్రైమ్ పార్టీతో విరివిగా దాడులు చేసామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో గొల్లప్రోలుకు చెందిన మొగిలి దుర్గా ఆనందరావు, సిరిపురెడ్డి వీరభద్రరావు, కర్రి కృష్ణ, గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన కీర్తి సూరిబాబు, ఎఫ్‌కే పాలెంకు చెందిన ఊట ధర్మరాజు, ఊటా శివ శంకర్, బి.ప్రత్తిపాడుకు చెందిన లింగం చిన బాబ్జీలను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. గొల్లప్రోలులో రెండు కేసులు, పిఠాపురం రూరల్‌లో రెండు కేసులు, మొత్తం 4 కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



పట్టుకున్న వాహనాలు, బియ్యంతో పోలీసులు

చాంపియన్స్‌గా తూర్పుగోదావరి జిల్లా జట్లు

ముగిసిన రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

పిఠాపురం: పిఠాపురంలో నిర్వహిస్తున్న కొప్పన మోహనరావు, రమాదేవి స్మారక రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో ఫైనల్స్‌లో విజయం సాధించిన తూర్పుగోదావరి జిల్లా బాలబాలికల జట్లు చాంపియన్స్‌గా నిలిచాయి. మంగళవారం నిర్వహించిన ఫైనల్స్‌లో హోరాహోరీగా జరిగిన పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా జట్టు చాంపియన్స్‌గా విజయం సాధించి, రన్నర్స్‌గా కృష్ణా జిల్లా జట్టు నిలిచాయి. విజేతలకు జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గత నాలుగు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి.



విజేతలైన క్రీడాకారులతో నాయకులు

రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరం



బార్ గేట్లను పోలీసులకు అందజేస్తున్న వైద్యుడు కాశీ విశ్వనాథం

పిఠాపురం: రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరమని కార్తికేయ హాస్పిటల్ వైద్యులు మొగలి కాశీ విశ్వనాథం అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక సీతయ్యగారి తోటకు చెందిన కార్తికేయ హాస్పిటల్స్ తరుపున రోడ్డు ప్రమాదాలపై అవగాహన కోసం తయారు చేయించిన 15 బార్ గేట్లను పిఠాపురం సీఐ శ్రీనివాస్‌కు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా పిఠాపురం సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన ఉండాలని, రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు పాటించాలన్నారు. బార్ గేట్లను అందజేసిన వైద్యులు కాశీ విశ్వనాథంను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై మణికుమార్, ఎస్సై జాన్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కమాండెంట్



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

కాకినాడ సిటీ: విజయవాడ ఆక్టోపస్ నుంచి బదిలీపై కాకినాడ ఏపీఎస్పీ థర్డ్ బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.నాగేంద్రరావు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

వ్యవసాయ అధికారుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, ప్లాంట్ డాక్టర్స్ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కాకినాడ సిటీ: ఏపీ వ్యవసాయ అధికారుల సంఘం కాకినాడ జిల్లా శాఖ రూపొందించిన 2025 క్యాలెండర్, ప్లాంట్ డాక్టర్స్ డైరీని కలెక్టర్ షణ్మోహన్ సగిలి, వ్యవసాయ శాఖ జేడీ ఎన్.విజయకుమార్ కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్‌కు పరిమిత సమయం కేటాయించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు: ప్రస్తుత కాలంలో ఇంటర్నెట్‌కు పరిమిత సమయం కేటాయించాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూకేలో సోమవారం సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ, ఈ ఏడాది మెరుగైన ఇంటర్నెట్ కోసం అనే థీమ్‌తో నిర్వహిస్తున్నామని, ఐఎస్ఈఏ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో ఆంధ్రా యూనివర్సిటీతో పాటు, జేఎన్‌టీయూ కాకినాడలో దీనిని నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా సైబర్ భద్రత, సురక్షితమైన ఆన్‌లైన్ అభ్యాసాలపై విభిన్న ఇంటర్నెట్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ప్రతి రోజూ గంట సమయం ప్రకృతితో పాటు, స్నేహితులతో గడిపితే.. ఇంటర్నెట్‌కు పరిమిత సమయం కేటాయించవచ్చన్నారు. రెక్టార్ కేవీ రమణ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 50 విద్యాసంస్థలను ఎంపిక చేయగా, అందులో జేఎన్‌టీయూకే ఉండటం సంతోషదాయకమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఐదేళ్లపాటు ఏటా రూ.50 లక్షల పైచిలుకు నిధులతో సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్, ఫిన్ టెక్నాలజీ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అలాగే రూ.40 లక్షలతో సీఎస్ఈలో గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్ర, సీఎస్ఈ హెడ్ రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.